అల్లాహ్ తాలా ఎలా పెంచునో గమనించుము. అల్లాహ్‌కు అంకితమైన వారు యాచించవలసిన అవసరం లేదు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. దుఆ చేయరని దీని భావము కాదు. అప్పుడప్పుడు విశ్వాసులపై ఇటువంటి స్థితులు వచ్చును. ఈ సంబంధము వలన కొందరు అల్లాహ్ తాలాతో గారాబము చేయుచు అల్లాహ్ తాలా స్వయముగా మా అవసరాలను తీర్చునని అందురు. కాని ఈ స్థాయి ఉచితముగానే లభించదు. మీరు కూర్చొనియుండి, తమ హృదయములలో ప్రేమను పుట్టించక పోయి, నమాజులలో భక్తి కలిగించుకోకున్నను, దాన ధర్మములు, చందాలలో నిర్లక్ష్యము వహించినను, అబద్ధము, మోసము చేసినను అల్లాహ్ తాలా ప్రత్యేక శుభమునకు వారసులగుదురని భావించకూడదు.

అల్లాహ్ తాలాతో బంధము ఎటువంటి సంకేతములను చూపునో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లు తెలిపిరి. మేము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో ఇట్లు విని యుంటిమి. హారూన్ రషీద్ హయాంలో ఒక సారి ప్రవక్త వంశములోని మూసా రిజా అను నామము గల సజ్జనుడొకరు వారి ద్వారా అశాంతి ఏర్పడే అవకాశమున్నదని బంధించబడిరి. ఒక సారి అర్థరాత్రి ఒక రక్షకభటుడు విడుదల ఆదేశ పత్రముతో వారి వద్దకు వచ్చెను. ఈ విధముగా తక్షణమే నా విడుదల ఆదేశమెలా వచ్చినదని వారు ఆశ్చర్యపడిరి. వారు రాజుతో కలిసి నన్ను అకస్మాత్తుగా ఎందుకు విడుదల చేసినారని ప్రశ్నించిరి. అతడిట్లు చెప్పెను. నేను నిద్రించుచుండగా స్వప్నములో ఇట్లు చూచితిని. ఒకరు వచ్చి నన్ను నిద్ర లేపిరి. స్వప్నములోనే లేచి మీరెవరని అడగగా హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అని తెలిసినది. ఆదేశమేమిటని నేను అడగగా వారిట్లనిరి. నీవు సుఖంగా నిద్రించుచున్నావు. అక్కడ మా కుమారుడు కారాగారములో యున్నాడు. విషయమేమిటి ? ఇది విని నాకు భయమేసినందున వెంటనే విడుదలకు ఆదేశములు జారీ చేసినాను.

అనంతరం హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) మరో సంఘటన తెలిపినారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రేమికులలో ఒకరైన అదే కీ॥శే॥ మున్షి అరూడా ఖాన్ గారు ప్రతి శుక్రవారము లేదా ఆదివారము ఖాదియాన్ చేరుటకు ప్రయత్నించుట అలవాటుగా చేసుకొనిరి. వారికి సెలవు లభించగానే ఇక్కడికి వచ్చేవారు. నెలకొక సారి అనే విషయమును ఇంతకు ముందు కూడ ప్రస్తావించినాను. రూపాయలు మిగిలేందుకు వచ్చేటప్పుడు అధిక ప్రయాణము నడిచే చేసేవారు. తద్వారా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సేవలో కానుక ఇవ్వవచ్చునని భావించేవారు. వారి వేతనము అప్పుడు చాలా తక్కువ యుండెను. బహుశా 15, 20 రూ॥లుండవచ్చును. దానితోనే కుటుంబ పోషణతో పాటు ప్రయాణ ఖర్చు కూడ సరిపెట్టుకునేవారు. నేను వారిని ఎల్లప్పుడు ఒకే కోటులో చూచినాను. రెండవ కోటు ధరించినట్లు నేను వారిని జీవితాంతం ఎన్నడు చూడలేదు. ఒక పాజామాతో పాటు ఒక సాధారణ చొక్కా ధరించేవారు. చిన్న చిన్నగా కొన్ని రూపాయలు ప్రోగు చేసి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సేవలో కానుక అందించాలని వారు కోరుకునేవారు. క్రమేణ వారు తమ నిజాయితి వలన ప్రగతి చెందుచు తహసీల్దార్‌గా పదోన్నతి పొందినారు.

వారి ప్రఖ్యాత సంఘటనను హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లు తెలిపిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పరమపదించిన తరువాత ఒక రోజు వారు నా వద్దకు వచ్చి నన్ను బయటకు పిలిచి, చాలా గట్టిగా రోధించడం మొదలు పెట్టిరి. కారణమేమిటో నాకు అర్థము కాలేదు. తరువాత 3,4 బంగారు నాణేలు తీసి నాకిచ్చి ఇట్లనిరి. వీటిని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు ఇవ్వడానికి నేను కోరుకునే వాడిని. కాని నాకు అనుగ్రహము లభించలేదు. అనుగ్రహము లభించిన తరువాత హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ ప్రపంచములో లేరు. తరువాత మరల రోధించడం మొదలు పెట్టిరి. దీనిని ప్రేమ అందురు. ప్రపంచ సౌకర్యములు

వాస్తవముగా వరములే అయినచో, వాటితో మనకు సుఖము లభించినచో అను విషయమును ప్రస్తావించుచు ఇట్లనిరి. ప్రపంచ సైకర్యములు అనేకం. వాటితో మనకు నిజమైన సుఖము లభించినచో ఒక విశ్వాసుని హృదయము తప్పక బాధ పడును. ఈ సౌకర్యములకు అర్హత యున్నచో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు లభించవలసి యుండెను. హజ్రత్ ఆయిషా రజియల్లాహు తాలా అన్‌హు సంఘటన తెలిసినదే. వారికి మెత్తటి రొట్టెలు లభించినప్పుడు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలములో ఇవి లభించేది కాదు, వారు దొడ్డుగా యున్న రొట్టెలు తినేవారని వారు కన్నీరు కార్చిరి.

ఇదే క్రమంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంతో తమ ప్రేమ గురించి ఒక సంఘటనను ప్రస్తావించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఈ సౌకర్యములు అర్హత కలిగియున్నచో ఇవి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు లభించవలసి యుండెను. వారి తరువాత వారి శిశువులైన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు లభించవలసి యుండెను. నా బాల్యములోనే అనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలా హయాంలోనే నాకు వేట చేయు కోరిక కలిగెను. ఒక తుపాకీ కూడ నా వద్ద యుండెను. ఎయిర్ గన్‌తో నేను వేటాడి వేటను ఇంటికి తీసుకొచ్చేవాడిని. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆహారము చాలా తక్కువ తినేవారు. మేధస్సుకు చెందిన పని ఎక్కువ చేసేవారు. వేట మాంసము మేధా శక్తి పనులు చేసేవారికి లాభదాయకమగునని నేను స్వయముగా లేదా ఒక వైద్యునితో వినియుంటిని. అందుకే నేను ఎల్లప్పుడు వేట మాంసము వారికి అందించేవాడిని. వేట మాంసము నేను స్వయముగా నా కొరకు వంట చేయించినట్లు నాకు గుర్తు లేదు. వేట మాంసము సదా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ఇచ్చేవాడిని. ఒకరితో సంపూర్ణ ప్రేమ కలిగినప్పుడు ఏ వస్తువును సౌకర్యముగా భావించడు. సౌకర్యము భావించినచో తన ప్రేమికుని హక్కు అని భావించును.

హుక్క (గుడ్గుడి) త్రాగుటకు బానిస అయిన ఒక వ్యక్తి సంఘటనను ప్రస్తావించిన తరువాత హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇదే హుక్క వలన ఒక మత్తు అలవాటు అతనికి యుండెను. అందుకే ఖాదియాన్ సత్సమాజ వాతావరణము వారికి ఆపదగా మారెను. సత్సమాజ వాతావరణము నుండి పారిపోయెను. ధార్మిక విద్య పొందలేక పోయెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సహవాసము పొందలేక పోయెను. మత్తు బానిసలందరికి ఇందులో ఒక గుణపాఠము గలదు.

ఇప్పుడు నేను ప్రపంచ స్థితిగతుల గురించి సంక్షిప్తముగా చెప్పదలచినాను. ఎంత వేగముగా ఏ వినాశనము వైపు ప్రపంచము వెళ్లుచున్నదో అందు కొరకు జమాఅత్ సభ్యులు దుఆల వైపు చాలా శ్రద్ధ వహించవలసిన అవసరమున్నది. ఫ్రాన్స్ భీభత్స సంఘటన తరువాత ఇరాక్, సీరియాలో యున్న నామమాత్రపు ఇస్లామీయ ప్రభుత్వమునకు వ్యతిరేకంగా ఇప్పుడు పశ్చిమ ప్రభుత్వములు క్రూరమైన చర్యలు చేపట్టుటకు నిర్ణయించినవి. విమాన దాడులకు ప్రణాళికలు రచించడమే కాక ప్రారంభించినవి. ఈ ప్రభుత్వములు దాడులు చేయదలచినచో హింసకు పాల్పడుచున్న వారిపై చేయవలెను. అల్లాహ్ తాలా అమాయకులను, సామాన్య ప్రజలను రక్షించుగాక! అక్కడ అనగా సీరియాలో నివసించుచున్న అధికులు దౌర్జన్యమునకు గురగుచున్నారు. వారికి వెనుక ముందు దారి లేనేలేదు. ముస్లిం పొరుగు రాష్ట్రములు కూడ ఈ పీడనమును అంతము చేయుటకు ఆలోచించడం లేదు. పొరుగు రాష్ట్రములు కలిసి అక్కడి ప్రభుత్వములకు సహకరించి, పీడనమును అంతము చేయవలసి యుండెను. దురదృష్టమేమనగా ముస్లిం ప్రభుత్వములు కూడ తమ తమ దేశములలో అన్యాయము, క్రూరమునకు పాల్పడుచున్నవి. ప్రపంచ యుద్ధమునకు దారి తీసే క్లిష్ట పరిస్థితులు ఏర్పడినవి. వాస్తవానికి చిన్న స్థాయిలో ప్రపంచ యుద్ధము మొదలైనదని మనము చెప్పవచ్చును. ఇప్పుడిక్కడి వ్యాఖ్యాతలు కూడ ప్రపంచ యుద్ధము మొదలైదని అంగీకరించడం

మొదలు పెట్టినారు. ఈ విషయము వైపు నేను గత చాలా సం॥ల నుండి దృష్టి కలిగించుచున్నాను. ఇప్పుడు వీరు కూడ ఇటువంటి విషయములు మాట్లాడుచున్నారు. కాని ఇప్పుడు కూడ న్యాయముతో పని చేయుటకు శ్రద్ధ వహించడం లేదని అనిపించుచున్నది. పెద్ద ప్రభుత్వములకు లేదా ముస్లిం ప్రభుత్వములకు ఇటు వైపు శ్రద్ధ కలగదు. నామమాత్రపు ఇస్లామీయ ప్రభుత్వములకు విరుద్ధముగా అందరు ఏకమై చర్య ప్రారంభించినట్లు బాహ్య రూపంలో తెలియుచున్నది. కనుక దీనిని అంతము చేసినచో లేదా చేయదలచినచో శాంతి పరిస్థితులు ఏర్పడును. కాని కొన్ని స్థితులు ఇటువైపు సంజ్ఞ చేయుచున్నవి. ఈ పీడనము అంతమైనను పరిస్థితులు చక్కబడవని, తరువాత పెద్ద శక్తుల మధ్య పరస్పరముము పై చేయి సాధించుటకు ప్రయత్నము మొదలగునని తెలియుచున్నది. యుద్ధము కూడ మొదలు కావచ్చును. ఎందుకనగా రూస్ మరియు ఇతర పశ్చిమ శక్తుల మధ్య విభేదాలు పెరుగుచున్నవి. సాధారణ ప్రజలే అధికంగా మరణింతురు. గత యుద్ధములలో కూడ సాధారణ ప్రజలు మరణించినట్లు మనము చూచినాము. అందుకే అధిక దుఆల అవసరమున్నది. అల్లాహ్ తాలా ప్రపంచమును వినాశనము నుండి రక్షించుగాక! ఇవే కాక గత కొన్ని సం॥లలో కొన్ని జాగ్రత్తలు వహించవలెనని జమాఅత్‌కు సూచించితిని. అటు కూడ దృష్టి సారించుము. ప్రపంచమును వినాశనము వైపు తీసుకెళ్లకూడదని అల్లాహ్ తాలా ప్రభుత్వములకు వివేకము ప్రసాదించుగాక! (ఆమీన్)

❁❁❁

BOOK POST (PRINTED MATTER)

To,

.....................................................................

.....................................................................

.....................................................................